తెలుగు దిన పత్రిక

http://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | మంగళవారం | 03-02-2026 | సంపుటి-03 | సంచిక-238 | పేజీలు - 08 | వెల:3/–




## మేడారం జాతర విజయవంతం

ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక

మంత్రి సీతక్క వెల్లడి

**అక్షరగళం, ములుగు,ఫిబ్రవరి2:**

మేడారం సమక్క ` సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క ` సారలమ్మ

మిగతా 2లో

## అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి

# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా



బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సీఎం రేవంత్

రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి2:**

తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆరఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి

మిగతా 2లో



## కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి2:**

మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆరఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని



మిగతా 2లో




## సర్పంచ్ ఎన్నిక కోసం కన్నకూతురు బలి

ముగ్గురు సంతానం నిబంధనతో ఒకరిని చంపేసిన తండ్రి

బాలిక హత్యను ఛేదించిన నిజామాబాద్ పోలీసులు

**అక్షరగళం, నిజామాబాద్,ఫిబ్రవరి2:**

పంచాయితీ ఎన్నికల కోసం ఓ తండ్రి కన్నకూతురునే బలితీసుకున్నాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి తన స్వార్ధం కోసం అభం శుభం తెలియని ఆరేళ్ల కూతురిని హత్య చేసిన సంఘటన కలకలం రేపుతోంది. ఈ సంఘటన నిజామాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

మిగతా 2లో

## పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం

బిజెపికి 8మంది ఎంపిలున్నా రాష్ట్రానికి శూన్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు

**అక్షరగళం, జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి2:**

రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీలేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నుంచి ఎనిమిది మంది

మిగతా 2లో





## గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

బూటకపు హామీలు `మోసపూరిత వాగ్దానాలు

ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి2:**

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు ` మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను

మిగతా 2లో

## వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్

పోలవరం ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లకు పైగా నిధులు

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం రూ.500 కోట్లు

బడ్జెట్‌పై ఎంపి పురందేశ్వరి వ్యాఖ్య




**అక్షరగళం, న్యూఢిల్లీ,ఫిబ్రవరి2:**

వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్ ఉందని బిజెపి ఎంపి పురందేశ్వరి అన్నారు. కర్తవ్య స్ఫూర్తిని కొనసాగించేలా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీ వేదికగా మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు. వరుసగా తొమ్మిది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధి కోసం 350 సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దేశాన్ని నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దక్కుతుందని

మిగతా 2లో

## రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి

# వైకాపా కుట్రలు



అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు

ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు

లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది

అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు

వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే

పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

**అక్షరగళం, అమరావతి,ఫిబ్రవరి2:**

రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదని చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ

మిగతా 5లో



## 9,10 తేదీల్లో ఉస్మానిలో తెలుగు లిటరరీ కాంగ్రెస్

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి2:**

ఈనెల 9, 10 తేదీల్లో రూమ్ నెంబర్ 133, ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం రెండు రోజులపాటు రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరగబోతోంది. యువరచయితల సాహిత్య సజన కేంద్రంగా జరగబోతున్న ఈ కాంగ్రెస్లో మొత్తం పది సెషన్లు ఉంటాయి. దాదాపు 55 మంది యువ కవులు, రచయితలు, నవలాకారులు, విమర్శకులు, సినిమా రచయితలు పాల్గొంటారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం తెలిపారు.

మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం

తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన

అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక

పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు



02

## సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు

ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా

కెసిఆర్ విచారణ తరవాత ఘటనపై హరీష్ రావు అభ్యంతరం

02



# తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం



**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి2:** రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులిబోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు



**హైదరాబాద్,ఫిబ్రవరి2:** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నోసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు.. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.



# మేడారం జాతర విజయవంతం

(మొదటిపేజీ తరువాత)

అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారని అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.



# 9,10 తేదీల్లో ఉస్మానియాలో తెలుగు లిటరరీ కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాత)

ఈ రెండు రోజులూ ఆర్ట్స్ కళాశాల ముందు బహిరంగ ఆవరణలో కవితా దునియా, కవిత జిందగీ పేర్లతో కవితా పఠనం, గాన/కళా ప్రదర్శనలు జరుగుతాయి. దీంట్లో దాదాపు 40 మంది యువ కవిగాయకులు, జానపద వత్తికళా ప్రదర్శకులు పాల్గొంటారు. ఈ రెండవ కాంగ్రెస్ కు డైరెక్టర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షులు, ఆచార్య సాగి కమలాకర శర్మ వ్యవహరిస్తారు.

# కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

(మొదటిపేజీ తరువాత)



కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆరఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

(మొదటిపేజీ తరువాత)

స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.







# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాత)

విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి

(మొదటిపేజీ తరువాత)



బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బ్జడెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్`2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ , నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి , పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

# వికసిత భారత్ లక్ష్యానికి అనగుణంగా బ్జడెట్




(మొదటిపేజీ తరువాత)

ఉద్ఘాటించారు. పేదరికం నుంచి 25 కోట్ల మందిని బయటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిందని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం రూ.500 కోట్లకుపైగా నిధులు ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించింది. పోలవరం, అమరావతికి కలిపి రూ.3800 కోట్ల వరకు నిధులు వచ్చాయి. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు నిధులు వస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లోనూ జిల్లాల ప్రస్తావన ఉండదు. కానీ కేంద్ర బ్జడెట్‌లో రాష్ట్రాల వారీగా కాకుండా మంత్రిత్వ శాఖలకు కేటాయింపులు ఉంటాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన మంత్రులను దృష్టిలో ఉంచుకుని.. అక్కడి పరిస్థితుల ఆధారంగా ప్రాజెక్టులకు నిధులు కేటాయించిందని పురందేశ్వరి అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బ్జడెట్ ఉంది. ప్రపంచ అవసరాలకు సరిపడేలా మన దేశంలో యువత ఉన్నారు. మహిళల సాధికారత కోసం ప్రతి జిల్లాలో మహిళలకు హాస్టల్స్ ఏర్పాటు చేస్తుంది. సంప్రదాయ విజ్ఞానం కొనసాగించేందుకు బ్జడెట్‌లో నిధులు కేటాయించారు' అని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని ఎంపీ తెలిపారు. 'చేనేత వృత్తులకు ప్రోత్సాహం కల్పించేలా ఓడీఓపీ ద్వారా చేతివృత్తుల వారికి లాభం చేకూరుతుంది. రాజమండ్రి, కాకినాడతో సహా నగరాల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో, జీడి మామిడి రైతులకు ప్రోత్సాహం అందించేలా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కొబ్బరి, కోకో ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో ఉంది. అనంతపురంలో మోనోజైట్ నిక్షేపాలు ఉన్నాయి. శ్రీకాకుళం, నెల్లూరులో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే మినరల్స్ ఏపీలో ఉన్నాయి. వికసిత భారత్ కావాలంటే వికసిత ఆంధ్రప్రదేశ్ కావాలి.. వికసిత రాష్ట్రాలు కావాలి.. ఆ దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని ఎంపీ చెప్పారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం కన్నకూతురు బలి

(మొదటిపేజీ తరువాత)




మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన పాండురంగ, త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. అయితే, ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హత ఉందని పాండురంగ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ఆరేళ్ల పెద్ద కూతురు ప్రాచీని బైక్‌పై తీసుకొచ్చి నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఎఆర్‌పి శివారులో కాలువలో పడేసి చంపేశాడు. కెనాల్‌లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని బయటకు తీసి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో కన్న తండ్రే హంతకుడని తేలింది. పాండురంగ్‌తో పాటు అతనికి సహకరించిన గణెళిష్ షిండేను అరెస్ట్ చేశారు. బాలికను తీసుకువచ్చేందుకు ఉపయోగించిన బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ కేసులో మృతురాలు తండ్రి పాండురంగతో పాటు కేరూరు సర్పంచ్ గణెళిష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



# కిందపడ్డా తమదే పైచేయి

సముద్రం ఒకరి కాళ్ల ముందు మోకరిల్లి కెరటమెత్తదు. శిఖరం ఒకరికి వంగి సలాం చేయదు. తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీ తాబేదారులకు, ఆ తాబేదారుల తాటాకు చప్పుళ్లకు తలొగ్గదు. పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకత నుంచి.. పాలకుల భూమాఫియా, 'ఫార్మా'ఫియా, 'హైడ్రా'ఫియా, సింగరేణి తదితర కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఒకటి తర్వాత మరొకటిగా గొలుసుకట్టుగా పారిస్తున్న అకృత్యాలకు మొన్న విద్యుత్తు.. నిన్న కాళేశ్వరం.. నేడు ఫోన్‌ట్యాపింగ్ పేర్లు ఏదైతేనేమి తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్నది వేధింపులస్వామ్యం. ప్రజాపాలన ముసుగులో కొనసాగుతున్న పగస్వామ్యం. కాంగ్రెస్ పాలనలో చౌకబారు రాజకీయాలకు సాక్ష్యం.. తాజాగా కేసీఆర్‌కు జారీ చేసిన సిట్ నోటీసులు అన్నది జగద్విదితం.

గతంలో జస్టిస్ ఘోస్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక అసెంబ్లీకి చేరింది. సభలో కాంగ్రెస్ పక్షం ఢాం..ఢూం అంటూ చిందులు తొక్కింది. కానీ, కొసాకరికి ఏమి తేలింది? అంతా ఉత్తదేనని స్పష్టమైంది. గతంలో విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలు అంటూ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డితో కమిషన్ వేశారు. ఆ కమిషన్ అసలు విషయాన్ని పక్కనపెట్టి 'నిర్దేశిత లీకులు' ఇచ్చి అభాసుపాలైంది. దీంతో జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి విచారణకు అసలు అర్హుడే కాదని సుప్రీంకోర్టు తేలుస్తుందనే విషయం గ్రహించి ఆ విచారణ నుంచి ఆయన తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తెలంగాణ మొత్తం కేసీఆర్ వెంటే ఉన్నది. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే. స్వరాష్ట్రాన్ని సాధించి, తెలంగాణను దేశానికి దిక్సూచిగా నిలిపిన ధీశాలి.. ధిక్కార పిడికిలి కేసీఆర్. సమైక్య పాలనలో ఆరు దశాబ్దాలపాటు తెలంగాణపై యథేచ్ఛగా సాగిన దోపిడీకి తిరిగి ద్వారాలు తెరవాలంటే అందుకు అడ్డుగా ఉన్న కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను కకావికలం చేస్తేకానీ సాధ్యంకాదని నిర్ధారించుకున్న తర్వాత తెలంగాణలో అసత్య పునాదులపై కుట్రల భవంతుల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. గురువు ఆదేశం.. శిష్యుని ఆచరణ, బడేభాయ్ హుకుం.. చోటేభాయ్ 'జీ హుజూర్'గా సర్వవిధాల తెలంగాణను తమ గుప్పిట పెట్టుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే ఒక్కొక్కటిగా పరిణామాలు పురికడుతున్నాయని తెలంగాణలో ప్రతి ఒక్కరికీ తెలిసిపోతున్నది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమల్లో విఫలమైంది. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ మోసాలు తెరమీదికి వచ్చినప్పుడల్లా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రదర్శిస్తున్న టక్కుటమార విద్యల్లో భాగమే విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు. తమకు అవసరమైన ప్రతీసందర్భంలో తాము చేసిన పనులకు ప్రజల దగ్గరి నుంచి మద్దతు రాదని తెలుసుకున్న ప్రతీసారి కాంగ్రెస్ పాలకులు తమకు ఆపద్ధర్మంగా ఎంచుకున్న మార్గమే నోటీసులు, విచారణలు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తక్షణం మెడమీద కత్తిలా వేలాడుతున్నది మున్సిపల్ ఎన్నికలు. నిన్నమొన్నటి గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సర్కార్ సర్వపటాలం కాలికి బలపం కట్టుకొని తిరిగినా బీఆర్ఎస్ 4045 శాతం సర్పంచ్‌లను గెల్చుకున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార బలం ఉపయోగించినా ప్రజలు అటువైపు మొగ్గుచూపలేదు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజావ్యతిరేకత స్థాయిలో ఉన్నదో బహిర్గతం కావడంతో కాంగ్రెస్ పార్టీ కంగుతిన్నది. పంచాయతీ ఎన్నికల్లో పరాభవానికి గురై చతికిల పడ్డా.. కాంగ్రెస్ పెద్దలు తామే విజయం సాధించాం అంటూ మీడియా సమావేశం పెట్టి మరీ డప్పుకొట్టుకున్నారు. అయితే, ఆ మీడియా సమావేశంలోనే 'నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరించింది' అన్నట్టు ఒక్క నేత ముఖంలో కూడా నెత్తురుచుక్క లేనితనాన్ని తెలంగాణ సమాజం గ్రహించింది. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను వాయిదావేశారని వేరే చెప్పాల్సిన పనిలేదు.

ఇక ఎట్టకేలకు అనివార్యమైన పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి వచ్చింది. ఈ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరుగుతాయి. పురపోరులో బీఆర్ఎస్ ధాటిని తట్టుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం. కాబట్టి ఆ పార్టీ శ్రేణులను నిలువరించడానికి కుట్రలు ముమ్మరం చేశారు. సిట్ నోటీసులు, విచారణ పేరుతో జిమ్మిక్కులు చేస్తున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల వేళ డైవర్షన్ రాజకీయాలను డైలీ సీరియల్‌లా నడిపితే తప్ప బీఆర్ఎస్‌ను నిలువరించలేమని కాంగ్రెస్ భావించింది. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌కు వరుసగా నోటీసులు ఇచ్చి, విచారణ జరిపింది. అయినా కాంగ్రెస్ నేతలు ఆశించిన స్థాయిలో మైలేజ్ రాలేదు. ఇక కేసీఆర్‌ను పిలిచి, బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతీయాలనే కుట్రతో సిట్ ఎదుట హాజరు కావాలని పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేశారు. రెండేండ్లుగా ప్రతీకార రాజకీయాలతోనే హస్తం పార్టీ పాలకులు పబ్బం గడుపుతున్నారు. చేసిందేమీ లేక, ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే ధైర్యంచాలక.. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ, నోటీసులు ఇస్తే ప్రజల దృష్టిని మళ్లుతుందని భావించడం అత్యాశ, చిత్తభ్రమ కాకపోతే మరేమిటి?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పాలకులు మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన రెండు పిల్లర్లపై రాద్ధాంతం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ (2024 మార్చిలో) ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ అనేక అంశాల్లో టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌కు అనుగుణంగా వందలాదిమంది దగ్గరి నుంచి వాంగ్మూలాలు సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వీర్యమైందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులు అసత్య ఆరోపణలు చేస్తూనే వచ్చారు. అప్పుడు ఇచ్చిన నోటీసుల తంతు లాగానే, అది జరిగింది. కాళేశ్వరంలో ఏదేదో జరిగిందని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. బీఆర్ఎస్‌లో ఒకరి తర్వాత ఒకరిని వరుసపెట్టి బీఆర్‌కే భవన్‌కు పిలిచారు. అందులో భాగంగా కేసీఆర్‌ను కూడా పిలిచారు. 2025 జూన్‌లో కమిషన్ ముందు కేసీఆర్ హాజరై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అనివార్యతలు, ప్రాజెక్టు నిర్మాణం అనంతరం రాష్ట్రంలో మారిన సాగు ముఖచిత్రాన్ని ఆధారాలు, గణాంకాలతోపాటు వివరించారు.

ప్రభుత్వానికి జస్టిస్ ఘోస్ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక అసెంబ్లీకి చేరింది. సభలో కాంగ్రెస్ పక్షం ఢాం..ఢూం అంటూ చిందులు తొక్కింది. కానీ, కొసాకరికి ఏమి తేలింది? అంతా ఉత్తదేనని స్పష్టమైంది. గతంలో విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వం జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డితో కమిషన్ వేసింది. ఆ కమిషన్ అసలు విషయం పక్కకుపెట్టి 'నిర్దేశిత లీకులు' ఇచ్చి అభాసుపాలైంది. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి విచారణకు అసలు అర్హుడే కాదని సుప్రీంకోర్టు తేలుస్తుందనే విషయం గ్రహించి, ఆ విచారణ నుంచి ఆయన తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం ప్రజలకు అప్పుడే అర్థమైపోయింది. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై ఉద్దేశపూర్వకంగానే కక్షసాధింపులు జరుగుతున్న సంగతి తెలిసిపోయింది.

తాజాగా కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వటం అంటే కాంగ్రెస్ సర్కార్ తన నెత్తిన తాను చేయి పెట్టుకున్నట్టే. రెండేండ్లుగా పెట్టిన కేసుల్లో ఒకదాంట్లోనైనా నిర్దిష్ట ఆరోపణ ఉన్నదా? గాలి ఆరోపణలు చేయడం, సోషల్ మీడియాలో తిప్పడం, విచారణ పేరుతో టైంపాస్ చేయడం మినహా జరిగింది ఏమైనా ఉన్నదా? అంటే ఏమీ లేదని అందరికీ తెలుసు. కానీ కాంగ్రెస్ పాలకులు ఇలా ఎందుకు చేస్తున్నారు? ఏమి ఆశించి చేస్తున్నారు? ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారు? ఎవరి ప్రాపకం కోరి చేస్తున్నారో రెండు వారాలుగా జరుగుతున్న పరిణామాలను లోతుగా గమనిస్తే అర్థమవుతూనే ఉన్నది. అయినా, తెలంగాణ ఆత్మగౌరవం.. ద్రోహుల సిట్టాకు చప్పుళ్లకు తలొగ్గుతుందా?

# సమస్యల్లో భావి భారత పౌరులు!



ప్రపంచ జనాభాలో పిల్లలు 25శాతం ఉన్నారు. వీరిలో సుమారు 16.8 కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) అంచనా వేసింది. సుమారు 3.6 కోట్ల మంది పిల్లలు బానిస బతుకులు గడుపుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన మానవ హక్కుల బృందం 'ద వాక్ ఫ్రీ ఫౌండేషన్' నివేదిక పేర్కొంది. పేదరికం, నిరక్షరాస్యత, అక్రమ రవాణా వంటి వాటి వల్ల ఎంతో మంది పిల్లలు బాల కార్మికులుగా మగ్గిపోతున్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందడం లేదు. బాలలు లైంగిక, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు.

భారతదేశంలో 23,68,17,000 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 11.45శాతం మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారని గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ గత డిసెంబర్ 8న విడుదల చేసిన నివేదిక తెలిపింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో 5 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సులోని దాదాపు కోటి మందికి పైగా మంది పిల్లలు పనుల్లో కొనసాగుతున్నారు. బాల కార్మిక శ్రమశక్తిలో 14 నుంచి 17 సంవత్సరాల పిల్లలు సుమారు 63శాతం ఉన్నారని 'సేవ్ ది చిల్డ్రన్' సంస్థ తెలిపింది. యూనిసెఫ్ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతంలో 5–14 ఏళ్ల వయస్సులోని బాల కార్మికుల సంఖ్యలో 54శాతం పెరుగుదల కనిపించింది. 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యం భారతదేశంలో ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 52వ నివేదికలో పేర్కొంది. ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు, హక్కుల రక్షణ వంటి ఐక్యరాజ్యసమితి అన్ని తీర్మానాలపైనా భారతదేశం సంతకం చేసింది. కానీ అవి ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు భిన్నంగా భారత బాలల పరిస్థితులు ఉన్నాయి. దేశంలోని నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి రెండవ బిడ్డ బరువు తక్కువగా ఉన్నాడు. ప్రాథమిక విద్యలోనే చదువు మానేసే పిల్లలు 71.01శాతం ఉన్నారు. ఇక, షెడ్యూల్డ్ కులాలు, తెగల బాలికలలో అక్షరాస్యత రేటు 42శాతం మాత్రమే. వంద మంది బాలికల్లో 30 మంది మాత్రమే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. వీరిలో ఇంకా బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70శాతం మంది భారత్, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. వీరిలో 35.7శాతం భారత్‌లో ఉంటే, ఆఫ్రికాలో 33.6శాతం ఉన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత విధానాలు, పేదరికం, పోషకాహార లోపం వల్ల పిల్లలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారు. బాల కార్మికులుగా ప్రమాదకరమైన పనుల్లో పనిచేయడం, పోషకాహార లోపం వల్ల ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షలాది బాలలు చనిపోతున్నారు.

బడికి వెళ్లి ఆటపాటలతో జీవించాల్సిన పిల్లలు బాల కార్మికులుగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులే కారణం. గత ప్రభుత్వాలు.. ముఖ్యంగా నేటి మోదీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నది. ఫలితంగా గ్రామీణులు పేదరికంలో మగ్గుతున్నారు. దాంతో బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే గ్రామీణ పేదలకు భూ పంపిణీ జరగాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పని కల్పించాలి. పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలి.

# సరిచేయాల్సింది తెలంగాణ సమాజమే



తెలంగాణ వారి దిష్టి తగిలి కోస్తాలో కొబ్బరి చెట్లు ఎండిపోయాయని తెగ బాధపడినవారు... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో తాను 11 రోజుల పాటు అన్నపానీయాలు మానేసి ఓ గదిలోనే కూర్చున్నానని చెప్పిన ఆ మహా నాయకుడు తెలంగాణ ప్రజల ఓట్ల కోసం ఇప్పుడు ఎందుకొస్తున్నాడబ్బా...ఇది ఇప్పుడు సగటు తెలంగాణ వాది ప్రశ్న...2009లో వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రకటనను వెనక్కి నెట్టి వందలాది మంది ఆత్మహత్యలు చేసుకోవడానికి కారకుడైన నాయకుడిని, ఆ పార్టీని మళ్లీ తెలంగాణలోకి బలవంతంగా తీసుకొచ్చే ప్రయత్నాలను కొందరు కుట్రల రూపంలో చేయడాన్ని ఇక్కడి ప్రజానీకం నిశితంగా గమనిస్తున్నారు. గురుదక్షిణ సత్వరమే చెల్లించాలని ఆతృత పడుతున్న శిష్యుడు తాను ఉన్న పార్టీ ఏమిటో కూడా మర్చిపోయి ఉద్యమ పార్టీ జెండా గద్దెలను కూల్చివేయాలని తెలుగు తమ్ముళ్లకు పిలుపునివ్వడం పట్ల యావత్తు తెలంగాణ ఆశ్చర్యపడిన పరిస్థితి... ఇన్ని జరుగుతుంటే తెలంగాణ సమాజం ఇంకా చూస్తూ ఊరుకోవాలా? వేచి చూసింది చాలు. ఇక నోరు తెరువకతప్పదు. అడుగు ముందుకేయపోతే మొదటికే మోసం. ప్రాణాలకు తెగించి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆగం అవుతుంటే చూస్తూ ఎట్లా ఊకుంటది? తెలంగాణ ఉద్యమాన్ని అడుగడుగునా అడ్డుకున్నవారు మన రాష్ట్రంపై మరోమారు కన్నేశారు. ఇక్కడ కాలుపెట్టాలని చూస్తున్నారు. అందుకు భారీ కుట్రలకు తెరలేపారు. సీమాంధ్ర పెత్తనాన్ని మరోసారి మనపై రుద్దేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తమ అడ్డాగా చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దీనికి కూటమి పేరుతో అడుగు పెట్టబోతున్నారనేది ప్రస్తుత పరిణామాలను బట్టి తెలుస్తున్నది. తెలంగాణలోని కొందరు ద్రోహులు వారికి వంతపాడుతున్నారు. దీనిని ముమ్మాటికీ అడ్డుకొని తీరాల్సిందే. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను రక్షించుకోవాల్సిందే. అమరవీరుల త్యాగాలు వృథా కాకుండా చూడాల్సిందే. ఈ చారిత్రక బాధ్యత మరోసారి వివిధ వర్గాలతో పాటు జర్నలిస్టు సమాజంపై కూడా పడింది. అందరూ కదలాల్సిన సమయమిది. కుట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేసి తీరాల్సిందే.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం, జనసేన పార్టీలు మెల్లమెల్లగా ఇక్కడ కాలుమోపేందుకు యత్నిస్తున్నాయి. ఇక్కడి తమ వారైన కొందర్ని మచ్చిక చేసుకుంటున్నాయి. వారి ద్వారా కూటమిగట్టి తెలంగాణలో పాగా వేయాలని గట్టిగానే యత్నిస్తున్నాయి. అందుకు మున్సిపల్ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని చూస్తున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్టు జనసేన ఇప్పటికే ప్రకటించింది. దాని వెంట తెలుగుదేశం పార్టీ వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఇది హఠాత్పరిణామం కాదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే చంద్రబాబు తన కుట్రలకు తెరతీశారు. ఇక్కడున్న తన శిష్యగణం ద్వారా రహస్య ఎజెండా అమలు చేస్తున్నట్టు రెండేండ్లుగా జరుగుతున్న పరిణామాలను బట్టి తెలుస్తూనే ఉన్నది. నీటి ప్రాజెక్టులపై కుట్రల నుంచి ఆంధ్రుల విగ్రహాల ఏర్పాటు వరకు, సంస్థల పేర్ల మార్పు నుంచి తెలంగాణ తల్లి రూపంలో మార్పు వరకు చంద్రబాబు ప్రభావం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది. నీటి ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రాకు ఈ రెండేండ్ల కాలంలో బహిరంగంగానే ఇక్కడి ప్రభుత్వం సహకరిస్తున్నది.

రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దని తెలంగాణ పౌర సమాజం గొంతెత్తి నినదించినా వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఘనంగా విగ్రహావిష్కరణ చేసి ఉద్యమ సోయి కలిగిన తెలంగాణ వారికి ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం సవాలు విసిరింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో ఎన్‌టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ ప్రకటించారు. ఆ దిశగా కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ రెండు విగ్రహాల ఏర్పాటుతోనే వీరు ఆగుతారని అనుకోలేం. ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణలో కూడా జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్టు చర్చ నడుస్తున్నది. ఇక్కడ జిల్లాల సంఖ్యను భారీగా కుదించనున్నట్టు తెలుస్తున్నది. వీటి వెనుక 'బాబు' హస్తం లేదంటే నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరు. బాలసుబ్రహ్మణ్యం లాంటి వ్యక్తుల విగ్రహాలు మాకెందుకు అనేది సగటు తెలంగాణ పౌరుడి ప్రశ్న. అయితే, వీరి లెక్కలను సరిచేయాల్సింది తెలంగాణ సమాజమే.

తెలంగాణ నీళ్లు, నిధులను కొల్లగొట్టిన చంద్రబాబు ఒకపక్క కుట్రలు చేస్తుండగా అతని అడుగుజాడల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా తెలంగాణపై కన్నేశారు. రెండు రాష్ట్రాల్లో పోటీ చేయడానికి జనసేన ఏమైనా జాతీయ పార్టీయా? ఆ పార్టీ ఇక అక్కడ అంతా చేసినట్టు ఇక్కడికి రావడానికి తయారైంది. తమ రాష్ట్రానికి సక్కగా రాజధానిని ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నవారు, దోపిడీ, ఆధిపత్యం కోసం కాకపోతే ఇక్కడ ఏం వెలగబెట్టేందుకు వస్తున్నారనేది పెద్దప్రశ్న.

హైదరాబాద్‌లో సెటిల్ అయిన సీమాంధ్ర వారితో కొత్తగా తమ పార్టీ శాఖలు ఇక్కడ తెరువాలని చూస్తున్నారు. తద్వారా మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చి పరోక్షంగా ఇక్కడ కాంగ్రెస్‌కు లాభం చేకూర్చాలనేదే వారి ఎత్తుగడ. కానీ 'తెలంగాణ నేతలు నాయకత్వం వహిస్తున్న రాజకీయ పార్టీలు ఇక్కడ ఉన్నాయి కదా. మీ ప్రాంతం వారు మిమ్మల్ని నమ్మి మీకు అధికారం ఇచ్చారు కదా. అక్కడ అభివృద్ధిని గాలికి వదిలేసి ఇక్కడ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి, ఒకవేళ ఒకటి, అర సీట్లు గెలిచినా మీరు సాధించేది ఏమిటి? ఎవరి ప్రయోజనాల కోసం ఇక్కడ పోటీ చేయడానికి సిద్ధమయ్యారో తెలుసుకోలేని స్థితిలో ఇక్కడి ప్రజానీకం లేరు' అని రాజకీయంగా ఎప్పుడో చైతన్యవంతులైన ప్రజలు అంటున్నారు.

ఏపీలో కూటమి పాలన మొదలైన తర్వాత దళితులపై దాడులు పెరిగాయి. రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయి. వ్యక్తిగత కక్షలతో కేసులు పెట్టుకుంటూ ముందుకు పోతున్న దుస్థితి చూస్తున్నాం. ఆ తరహా రాజకీయాలను తెలంగాణలో కూడా చేయడానికి, రాష్ట్రాన్ని ఆగం చేయాలని చూస్తున్నారు. కూటమిలో ఉన్న తెలుగుదేశం, జనసేనకు తోడు రేపు బీజేపీ కూడా ఇక్కడ జతకట్టే అవకాశాలను కొట్టి పారేయలేం. అయితే బీజేపీ నాయకులకు తెలంగాణ ఇప్పటికీ అర్థం కాలేదు అనిపిస్తున్నది. జాతీయ రాజకీయ పరిస్థితులను చూసి, ఇక్కడి ప్రజలు ఆ పార్టీకి ఎంపీ స్థానాలు ఇస్తూ వస్తున్నారు. కానీ అసెంబ్లీలో ఆశించిన స్థాయిలో వారికి ఎన్నడూ సీట్లు ఇవ్వలేదు. దానికి కారణం కూడా లేకపోలేదు. బీజేపీ తరహా రాజకీయ ఆలోచనా విధానంతో తెలంగాణ ప్రజలు లేరు. ఉండే అవకాశం లేదు. అందువల్లనే ఇక్కడ ఆ పార్టీ బలపడటం లేదు. అంతేకాదు.. ఆ పార్టీ స్థానిక నాయకులకు తెలంగాణ చరిత్ర కూడా తెలియదు అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు పోరాటానికి, తెలంగాణ ఉద్యమానికి వారు ముడిపెట్టి మాట్లాడటం చూస్తే మనకు అర్థం అవుతుంది. కనుక తెలంగాణ ప్రజల ఆరాటాలు, పోరాటాలు ఇక్కడ జీవన నేపథ్యాల గురించిన లోతైన అవగాహన వారికి లేదని చాలాసార్లు రుజువు అయింది. ఆ పార్టీకి కొన్ని ఎంపీ సీట్లు ఇస్తున్నప్పటికీ, ఎమ్మెల్యే సీట్ల విషయంలో గాని, మొన్నీమధ్యనే జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గానీ ఇక్కడి ప్రజలు ఆ పార్టీని విశ్వసించ లేదనేది రుజువు అయింది. ఈ విషయాన్ని గమనించిన బీజేపీ నాయకులు కూటమి పేరుతో ఇక్కడ బలపడాలని చూస్తున్నారు. బీజేపీని ఒంటరిగానే ఎవరూ నమ్మడంలేదు ఇక్కడ. ఇక ప్రతినిత్యం తెలంగాణపై కుట్రలు పన్నే దుష్ట కూటమిలో భాగంగా జత కట్టి వస్తే జరిగే నష్టం గురించి కూడా ఆ పార్టీ వారికి తెలిసితీరుతుంది.

రెండేండ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా మొదలు పెట్టలేదు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవు. మరోవైపు సీమాంధ్ర మీడియా పెత్తనం మితిమీరిపోతున్నది. అదే మీడియా ఉన్నతాధికారులను సైతం అవమానిస్తూ వార్తలు ప్రసారం చేస్తున్నది. ఎమ్మెల్సీ స్థాయి పెద్ద మనుషులను టీవీ డిబేట్‌లకు అతిథులుగా పిలిచి 'గెట్ అవుట్' అంటున్నది. అదే ప్రాంతపు మీడియా మనకు నీతులు బోధిస్తున్నది. ప్రభుత్వాన్ని తామే నడుపుతున్నామనే సంకేతాన్ని బలంగా పంపించే ప్రయత్నాలు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీళ్లంతా కిమ్మనకుండా ఉన్నారు. కానీ ఇప్పుడు రెచ్చిపోతున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కూడా డ్యామేజ్ చేసేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారు.

మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ప్రభుత్వ పెద్దలే పదేపదే చెప్తున్నారు. అభివృద్ధి రథచక్రాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. సీమాంధ్ర పెట్టుబడిదారులు హైదరాబాద్‌పై పెత్తనం కోసం ఢిల్లీ పెద్దలతో కలిసి కుట్రలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అదే జరిగితే తెలంగాణ ప్రజల బతుకు ఆగం కావడం ఖాయం.

బీజేపీ, కాంగ్రెస్ నేతలకు తెలంగాణ కష్టాలు తెలియవు. వారికి తెలంగాణ సోయి లేదు. మన రాష్ట్రంపై కుట్రలు జరుగుతున్న ఈ సమయంలో యావత్తు తెలంగాణ సమాజం మేల్కోవాల్సిందే. సీమాంధ్ర పెత్తనాన్ని అడ్డుకుని తీరాల్సిందే. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అంటూ ఉద్యమ సమయంలో నినదించిన గొంతులు మరోమారు గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైంది. 13 ఏండ్ల మలిదశ ఉద్యమ ప్రస్థానంలో స్తబ్దత నెలకొన్న ప్రతిసారీ దానిని బద్దలు కొట్టడానికి ముందుకుసాగిన కలం వీరులు మరోసారి కలం కవాతు చేయాల్సి ఉన్నది. హైదరాబాద్ లాంటి నగరం పదేండ్లు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పుడు కిక్కురుమనకుండా ఉన్న ఆంధ్ర పార్టీలు ఆ సమయం అయిపోగానే ఇప్పుడు ఇక్కడికి రావడానికి ఎందుకు తహతహలాడుతున్నాయో బుద్ధిజీవులుగా ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తెలంగాణ జర్నలిస్టు కాపలాదారులుగా ఉండటమే కాదు.. కలాలకు పదును పెట్టి అవసరమైతే కదనరంగంలోకి దూకడానికి కూడా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది.


తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్



# బౌరంపేట్‌లో వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి జాతర

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు అన్నారు. బౌరంపేట్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం , మల్లన్న స్వామి జాతర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాచారం మురళి యాదవ్, మహిపాల్ రెడ్డి, వ్యాపార వేత్తలు శ్రీనివాస్ రావు, కోలన్ నరేందర్ రెడ్డి, కోలన్ రాజ్ మోహన్ రెడ్డి, నర్సింహా రెడ్డి, హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా లిటిల్ చాంప్స్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్నగర్ లో గల లిటిల్ చాంప్స్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలతో ఆహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ పిల్లలకి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. భవిష్యత్తులో ఏ కార్యక్రమం తలపెట్టిన అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నదీమ్ రాయ్ , యూనిక్ స్కూల్ అధినేత కుత్బుల్లాపూర్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ శివయ్య , వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ అధినేత , స్కూల్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , మల్లేష్, వరప్రసాద్ , ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ నాయకులు రవికుమార్ , మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హైడ్రా కాపాడిన 4పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి...

- ఆకుల సతీష్

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పార్కులలో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహించడమే కాకుండా కబ్జాదారులకి మరొకసారి ఆక్రమించుకోవడానికి సహకరిస్తున్నట్టుగానే కనిపిస్తుందని బీజేపీ నేత ఆకుల సతీష్ అన్నారు. ఆక్రమణదారులపై, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలి అని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ జాకు వినతిపత్రం ఇచ్చి వివరించగా, తక్షణమే పార్కు స్థలాలను పరిశీలించి, మౌలిక వసతులు , అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులకు మౌలికంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బృందావన్ కాలనీ పార్క్, కేజీఎం కాలనీ పార్కులు , వివిఎన్ఆర్ కాలనీ పార్కులు కబ్జాలకు గురైతే, కాలనీ వాసులతో కలిసి మేము పూర్తి ఆధారాలతో హైడ్రాకు ఫిర్యాదు చేయగా, హైడ్రా పార్కును కాపాడడమే కాకుండా ఫెన్సింగ్ వేసి రక్షించిందన్నారు. ప్రస్తుత నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్





షబీర్ అలీ ఈ 4 పార్కుల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఫిర్యాదు చేసినా, నాలుగు పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా, వారు తక్షణమే సమస్య పై పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాచుపల్లి కేజీ ఎం కాలనీ లేఔట్ నందు రెండు వేల గజాల రెండు పార్క్ స్థలాలు ఉన్న 2022లో కబ్జాకు గురైనా కమిషనర్ కు కలెక్టర్కు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం. కానీ 2025లో హైడ్రాకు ఫిర్యాదు మేరకు పార్కుల్లో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసిన డిప్యూటీ కమిషనర్ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. బృందావన్ కాలనీ పార్క్ (20 గుంటలు)*కలెక్టర్ 2020లోsy no93 లో 20 గుంటల ప్రభుత్వ భూమిని పార్కుగా తీర్చిదిద్దండి అని మున్సిపల్ కార్పొరేషన్ ఉత్తర్వులు ఇచ్చిన అభివృద్ధి చేయకపోవడం వల్ల 2025లో కబ్జాకు గురైనా, పలు ఫిర్యాదుల మేరకు హైడ్రా ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసిందన్నారు. డిప్యూటీ కమిషనర్ ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన మౌలిక వసతులు కల్పించకపోవడం. వివిఎన్ఆర్ పార్క్ (3 ఎకరాలు) ప్రగతి నగర్ గ్రామపంచాయతీ నిధులతో కాకుండా, ₹2 కోట్ల నిధులతో పార్కు, నర్సరీగా అభివృద్ధి చేయగా నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2023లో కబ్జాకు గురై, హైడ్రా ఆక్రమణలు తొలగించింది కానీ డిప్యూటీ కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ గౌడ్, అమలేశ్వరి, ఈశ్వర్ రెడ్డి, పిబి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బి ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిక

**కల్వకుర్తి ఫిబ్రవరి 2 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏడవ వార్డుకు చెందిన మాజీ వార్డు మెంబర్ బంగారయ్య పురుషోత్తం గాంధీ సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పొల్యూషన్ బోర్డ్ కంట్రోల్ మెంబర్ బాలాజీ సింగ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి బృంగి ప్రవీణ్ కుమార్ మాజీ కౌన్సిలర్ చిన్న మబ్బు రామరాజు మిరియాల శ్రీనివాస్ రెడ్డి జిల్లెల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.







# ప్రపంచంలో నే తెలంగాణా సాయుధ పోరాటం గొప్ప చరిత్ర కలది

- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అక్షర గళం, హైదరాబాద్ :** ప్రపంచంలో నే తెలంగాణా సాయుధ పోరాటం గొప్ప చరిత్ర కలదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణా సాయుధ పోరాట వీరుడు పద్మవిభూషణ్ రావినారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డును సోమవారం జస్టిస్ సుదర్శన్ కి సిఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి తనకు వారసత్వంగా వచ్చిన 500 ఎకరాలను పేద ప్రజలకు పంచిన గొప్ప వ్యక్తని,దేశంలోనే అత్యధిక ఓట్లు సాధించి ఈ దేశ పార్లమెంట్ ను ప్రారంభించిన చరిత్ర రావినారాయణ రెడ్డి కే దక్కిందని అన్నారు. రావినారాయణ రెడ్డి పోరాటం గొప్ప స్ఫూర్తి అని అన్నారు. యువకులకు రాజకీయ నాయకత్వం ఇవ్వాలని 60 సంవత్సరాలకె రాజకీయాల నుండి తప్పుకొని నిస్వార్ధ జీవితం గడిపారని అన్నారు.



# ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, శాంతి , సాంప్రదాయ విలువలను బలోపేతం చేస్తాయి

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**అక్షరగళం, (కుత్బుల్లాపూర్ ) :** ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, శాంతి , సాంప్రదాయ విలువలను బలోపేతం చేస్తాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట గ్రామంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి , శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మదేవి కళ్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి , అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం సమృద్ధితో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పద్మరెడ్డి, ఎం. యాది రెడ్డి, విజయ్ గౌడ్, చింత సురేష్, ఆకుల యాదయ్య, చింత మల్లేష్, భుజంగ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నర్సింహా యాదవ్, బాల్రాజ్, జి. సత్యనారాయణ, ఎం. జంగారెడ్డి, నవీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధునోళ్ల సంజీవ రెడ్డి, మైసి గారి శ్రీనివాస్, శివ, గురువ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సత్తా చాటుదాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆమనగల్లు 15 వార్డులకు అభ్యర్థుల ప్రకటన

**ఆమనగల్లు, ఫిబ్రవరి 02 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుదామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ సభ్యులు, ఆమనగల్లు మున్సిపాలిటీ ఇన్చార్జి అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి 15 వార్డులకు అభ్యర్థులను ప్రకటించారు. 1వ వార్డు నేనావత్ విజయ రాగ్యనాయక్, 2వ వార్డు కాలే రాజేశ్వరి మహేష్, 3వ వార్డు నేనావత్ విజయ చందు నాయక్, 4వ వార్డు దుడ్డు కృష్ణ యాదవ్, 5వ వార్డు వగ్గు మహేష్, 6వ వార్డు మల్లేష్ నాయక్, 7వ వార్డు కృష్ణ నాయక్, 8వ వార్డు వస్పుల మానయ్య, 9వ వార్డు గుర్రం కేశవులు, 10వ వార్డు అనిత శ్రీనివాస్ రెడ్డి, 11వ వార్డు అంజలి గణేష్, 12వ వార్డు అప్పం శ్రీను, 13వ వార్డు శారద లక్ష్మణ్ నాయక్, 14వ వార్డు కాలే మల్లయ్య, 15వ వార్డు రేవతి శివలింగం పేర్లను ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి ఓటర్లందరినీ కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, రవీందర్, మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, ప్రభాకర్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ ఖాద్రి, అబ్దుల్ అలీమ్, ఇమ్రాన్ బాబా, శ్రీధర్ నాయక్, నాజర్, దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్, పులికంటి మైసయ్య, గాజుల సురేష్, రాజు, శ్రీను నాయక్, గౌస్, భాస్కర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లికల్లో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

- గ్రామ సర్పంచ్ జిల్లెల్ల పద్మ కృష్ణ యాదవ్

**కల్వకుర్తి ఫిబ్రవరి 2(అక్షర గళం):** కల్వకుర్తి మండల పరిధిలోని ఎన్నికల గ్రామంలో సోమవారం నూతన గ్రామపంచాయతీ భవనానికి సర్పంచ్ జిల్లెల్ల పద్మ కృష్ణ యాదవ్ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మున్యానాయక్ గ్రామపంచాయతీ కార్యదర్శి అభిజిత్ రెడ్డి మాజీ జెడ్పిటిసి సభ్యులు సింగం బాలస్వామి గౌడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ మాజీ ఎంపీపీ కొందూరు గోవర్ధన్ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి వార్డు సభ్యులు పర్వతాలు పరమేష్ శేఖర్ వెంకటమ్మ వెంకటయ్య రాములు బాలరాజ్ గ్రామ పెద్దలు గుండయ్య నారాయణ మొగులాల్ శ్రీశైలం వెంకటయ్య అశోక్ జంగయ్య గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- గుర్రం కేశవులు


**ఆమనగల్లు, ఫిబ్రవరి 02 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి ఆశీర్వదించండి.. మున్సిపాలిటీను అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గుర్రం కేశవులు అన్నారు. సోమవారం 9వ వార్డు పరిధిలోని శ్రీకాంత్ నగర్ కాలనీ, పోస్ట్ ఆఫీస్, వెంకటగిరి, విద్యా నగర్ కాలనీలలో మాజీ జడ్పీటీసీ, వార్డు ఇంచార్జీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం కేశవులు మాట్లాడుతూ.. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 9వ వార్డు పరిధిలోని అన్ని కాలనీలను మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ కరీం, వెంకటేష్, సురేష్‌నాయక్, కుమార్ గౌడ్, గాజుల రమేష్, యోగి, సలీం, రమేష్ తదితరులు ఉన్నారు.



## రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు

(మొదటిపేజీ తరువాత)

వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని ఛీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను



కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పునర్నిర్మాణ ప్రక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సామ అంజయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి 2 ఫిబ్రవరి (అక్షర గళం):**

కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో వెల్దండ మండల పరిధిలో రాఘయిపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ సామ వెంకటయ్య తండ్రి సామ అంజయ్య మరణ వార్త సోమవారం తెలుసుకొని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే రాఘయిపల్లి గ్రామంలోని వారి నివాసానికి చేరుకుని అంజయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీతో పాటు నాయకత్వం ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ అపార నష్టాన్ని కుటుంబ సభ్యులు తట్టుకునేలా దేవుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,BRS పార్టీ జిల్లా నాయకులు నాగులు నాయక్,నాగుల శ్రీనివాస్,చౌదర్ పల్లి ఉప సర్పంచ్ రాజు,రాయికంటి గిరి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.








## జిల్లెల్ల అంగన్వాడీలో బాలామృతం పంపిణీ

**కల్వకుర్తి ఫిబ్రవరి 2 (అక్షర గళం):**

కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లా గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో సోమవారం గ్రామ సర్పంచ్ కొమ్మ గోని రాజేశ్వరి రవి గౌడ్ ఉప సర్పంచ్ ఎముక రవి ఆధ్వర్యంలో బాలామృతం గుడ్లు చిన్నపిల్లల తల్లులకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తిరుపతి గౌడ్ అంగన్వాడి టీచర్ లక్ష్మమ్మ వార్డు సభ్యులు జి నాగమణి మహేందర్ మౌనిక మల్లయ్య చెన్నమ్మ జంగయ్య యూత్ నాయకులు గుమ్మం కొండ తేజ మహిళా తల్లులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

- యాట నర్సింహా

**ఆమనగల్లు, ఫిబ్రవరి 02 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కాలే రాజేశ్వరి మహేష్ తరపున టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా లు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ఆమనగల్లు మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలను గెలుచుకుని చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందన్నారు. ప్రచార కార్యక్రమంలో కర్నాటి చెన్నారెడ్డి, సాయిరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, కాలే శివకుమార్, రత్నం, ప్రదీప్, మధు, విజయకుమార్, లోకేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి పథంలో నడిపిస్తా..

- పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, ఫిబ్రవరి 02 (అక్షర గళం):** మీ ఇంటి బిడ్డగా వార్డును మరింత ప్రగతి పథంలో నడిపిస్తానని 5వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాపిశెట్టి రాము అన్నారు. వార్డు పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజారిటీతో 5వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. ఆశీర్వదించి గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. ప్రచార కార్యక్రమంలో 7వ వార్డు అభ్యర్థి కిషోర్ నాయకులు చలిచీమల సతీష్, జంతుక కిరణ్, పూసల భాస్కర్, కార్తీక్, శ్రీరాములు, రాఘవేందర్, చింటూ, భరత్, శివ, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ హయాంలోనే మున్సిపాలిటీల అభివృద్ధి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కాంగ్రెస్ 2 వార్డుల కౌన్సిలర్లకు బీఫామ్ అందజేత

**కల్వకుర్తి ఫిబ్రవరి 2 (అక్షర గళం ):**

కల్వకుర్త ఆమనగల్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారాలతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి కృషి చేస్తూ కల్వకుర్తి మున్సిపాలిటీకి 70 కోట్లు ఆమనగల్ మున్సిపాలిటీకి 63 కోట్ల నిధులతో అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు సోమవారం మీడియాతో మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని చర్చించుకుంటున్నారని తెలిపారు. గత పదేండ్లుగా కల్వకుర్తిలో అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల్లో కల్వకుర్తి ముంచిపాలిటీలో పురోగతిని సాధించామని తెలిపారు ప్రజలు అభివృద్ధి సంక్షేమం చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జగనన్నపల్లి మాజీ సర్పంచ్ తలసాన్ని అనిల్ రెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 2 (అక్షర గళం):** సీఎంఆర్ఎస్ పేదలకు అండగా ఉంటుందని ఆపదలో ఉన్న పేదవారికి ఆరోగ్యం భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్ అవసరగా ఉంటుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జకినాలపల్లి మాజీ సర్పంచ్ చలసాని అనిల్ రెడ్డి అన్నారు. సోమవారం ఊరుకొండ మండల జకినాలపల్లి గ్రామానికి చెందిన ఎండి ఇమామ్ 36000 అమ్మపల్లి తండాకు చెందిన దేశ్యా కు 24500 భాస్కర్ కు 18000 జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహాయ సహకారాలతో సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉండి పేదవాడికి వైద్యం అందించడానికి తోడుగా ఉంటుందని అన్నారు సీఎం రిలీఫ్ చెక్కులను సహకరించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి చంద్రయ్య చిన్న వెంకటయ్య పోల లింగయ్య శేఖర్ మహేష్ నరేందర్ రెడ్డి నరసింహ గెలువయ్య జంగయ్య జైపాల్ మై బుల్ తదితరులు పాల్గొన్నారు.

## మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు

### హైదరాబాద్ నుంచి మూడు కారిడార్లు



**దిల్లీ:** రైలు బండి వేగాన్ని పెంచడానికి నిర్మలమ్మ సంకల్పించారు. దేశంలో ఏడు అధిక వేగ నడవాలు (హైస్పీడ్ కారిడార్లు), సరకు రవాణాకు ఒక ప్రత్యేక కారిడార్ నిర్మించడానికి బడ్జెట్లో కేటాయింపులు చూపించారు. రైలుమార్గాల నిర్మాణం, ఇంజిన్లు/ వ్యాగన్లు/ కోచ్‌ల కొనుగోలు సహా మొత్తంగా రూ.2,77,830 కోట్లను రైల్వేకు మూలధన వ్యయం కింద కేటాయించాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. రైల్వేకు కేటాయింపుల్లో ఇదే అత్యధికం. మొత్తంగా రైల్వే ఆదాయం రూ.3,85,733 కోట్లు, వ్యయం రూ.3,82,186 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అదనంగా బడ్జెటేతర నిధులుగా రూ.15,000 కోట్లు అందనున్నాయి. మొత్తంగా రూ.3,547 కోట్ల మిగులు సాధించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పోలిస్తే కొత్త కేటాయింపులు 10.25% ఎక్కువ. ''ఆస్తులు సృష్టించడానికి, కొత్త పనులకు నిధులు ఇవ్వడానికి సరిపడినంత ఆదాయం రైల్వేకు సొంతంగా ఉండటం లేదు. అందుకే ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తుంది. ఆ ప్రకారం ఈసారి మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు'' అని రైల్వే అధికారి ఒకరు వివరించారు. రైళ్లు ఢీకొనకుండా నిరోధించే కవచ్ వ్యవస్థ విస్తరణకు ప్రాధాన్యం లభించనుందని చెప్పారు.

దేశంలో రవాణాను వేగవంతం చేయడానికి ఏడు హైస్పీడ్ కారిడార్లను కొత్త బడ్జెట్లో ప్రతిపాదించారు. ముంబయిపుణె, పుణెహైదరాబాద్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, దిల్లీవారణాసి, వారణాసిసిలీగుడీ, డాంకునీ (పశ్చిమబెంగాల్) సూరత్ మధ్య ఇవి రానున్నాయి. వీటిలో డాంకునీసూరత్ మధ్య నిర్మించేదానిని సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆర్థికమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 202425 ఆర్థిక ఆర్థిక సంవత్సరంలో రైల్వే వ్యయం రూ.3.32 లక్షల కోట్లు, ఆదాయం రూ.3.35లక్షల కోట్లుగా ఉంది. తద్వారా రూ.3,316.45 కోట్ల మిగులు సాధించింది. ఆ ఏడాది రైల్వే చేసిన ఖర్చులో అధిక మొత్తం (రూ.58,844.07 కోట్లు) ఉద్యోగుల పింఛన్లకే వెళ్లింది. ఇది 2026 27లో ఇది రూ.74,500 కోట్లకు చేరుతుందని అంచనా.

## గత ఏడాదితో పోలిస్తే 15 శాతం పెరిగిన కేటాయింపులు

### సైనిక ఆధునికీకరణకు పెద్దపీట



ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులను కేంద్రం భారీగా పెంచింది. పాకిస్థాన్, చైనాలతో భద్రతా సవాళ్లు కొనసాగుతున్న తరుణంలో సైనిక పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ చర్యను చేపట్టింది. 2026 27 బడ్జెట్లో రక్షణ రంగానికి రూ.7,84,678 కోట్లు కేటాయించింది. గత ఏడాది కేటాయింపుల (రూ.6.81 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఈ దఫా ప్రధానంగా ఆధునికీకరణకు పెద్దపీట వేశారు. ప్రభుత్వం 202627లో చేయదలిచిన వ్యయంలో రక్షణ వాటా 14.67 శాతంగా ఉంది. మంత్రిత్వ శాఖలన్నింటిలోకీ ఇదే అత్యధికం. మొత్తంమీద గత 26 ఏళ్లలో రక్షణ బడ్జెట్ 40 శాతం పెరిగింది.

మొత్తం కేటాయింపుల్లో రూ.2,19,306 కోట్లను మూలధన వ్యయం కింద కేటాయించారు. ఈ సొమ్మును కొత్త ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక సాధన సంపత్తి కొనుగోలుకు వినియోగిస్తారు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.1.80లక్షల కోట్లను కేటాయించగా సవరించిన అంచనాలను రూ.1,86,454 కోట్లకు పెంచారు. 202526 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే తాజాగా కేటాయించిన మూలధన వ్యయం 21.84% అధికం. మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కొనుగోలుకు రూ.63,733 కోట్లు కేటాయించారు. నౌకాదళ ఆధునికీకరణ అవసరాల కోసం రూ.25,023 కోట్లు ప్రత్యేకించారు. రెవెన్యూ వ్యయం కింద రూ.5,53,668 కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 17.24 శాతం అధికం. దళాల రోజువారీ కార్యకలాపాలు, వేతనాలు, ఇంధనం, రేషన్, ఆయుధాల నిర్వహణ, మందుగుండు వంటి అవసరాలకు ఈ సొమ్మును వెచ్చిస్తారు. ఇందులోనే పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లను కేటాయించారు. మూలధన వ్యయ కేటాయింపుల్లో 75 శాతాన్ని (రూ.1.39 లక్షల కోట్లు) దేశీయ పరిశ్రమల నుంచి చేసే కొనుగోళ్లకు మాత్రమే వెచ్చించాలని నిర్ణయించారు. పౌర, శిక్షణ, ఇతర అవసరాలకు ఉపయోగించే విమానాల తయారీకి అవసరమైన భాగాల దిగుమతులను బేసిక్ కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు. అలాగే రక్షణ రంగంలో నిర్వహణ, మరమ్మతుల అవసరాలకు ఉపయోగపడే విమాన భాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడిపదార్థాలపైనా ఈ సుంకాన్ని తొలగించారు. ఈ రెండు నిర్ణయాల వల్ల రక్షణ ఏరోస్పేస్ రంగానికి ఊతం లభిస్తుందని భావిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. సరిహద్దు రహదారి సంస్థ (బీఆర్‌వో)కు రూ.7,394 కోట్లు కేటాయించారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు గత బడ్జెట్‌లో రూ.26,816.82 కోట్లు కేటాయించగా.. ఈ దఫా దాన్ని రూ.29,100 కోట్లకు పెంచారు. ఇందులో రూ.17,250.25 కోట్లను మూలధన వ్యయం కోసం ప్రత్యేకించారు. మాజీ సైనికోద్యోగుల కంట్రిబ్యూటరీ ఆరోగ్య పథకానికి గత ఏడాదితో పోలిస్తే 45.49 శాతం పెంచి, రూ.12,100 కోట్లను కేటాయించారు.

## ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు.. దూసుకెళ్లిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. బడ్జెట్‌లో పన్నుపోటుతో నిన్నటి స్పెషల్‌లో భారీ నష్టాలు మూటగట్టుకున్న సూచీలు.. బడ్జెట్‌లోని ఇతర అంశాలపై మదుపర్లు దృష్టి సారించడంతో నేడు దూసుకెళ్లాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమై ఓ మోస్తరు శ్రేణి లాభాల్లో కదలాడిన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. దీంతో మదుపర్ల సంపద ఒక్కరోజులోనే దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.455 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మళ్లీ 25వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 80,555.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,722.94) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,732.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 943.52 పాయింట్ల లాభంతో 81,666.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 252.95 పాయింట్ల లాభంతో 25,088.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.50గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, ట్రెంట్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

# మరింత పడిన బంగారం, వెండి ధరలు



బంగారం, వెండి కొనాలనుకునే వారికి గుడ్‌న్యూస్. వీటి ధరలు మరింత దిగొచ్చాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో శుక్రవారం భారీగా పతనమైన ఈ లోహాల ధరలు.. సోమవారం మరింత దిగువకు చేరాయి. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్‌లో బంగారం ఔన్సు మరో 6 శాతం క్షీణించి 4,538 డాలర్లకు చేరగా.. వెండి ఔన్సు 74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి.

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతుండగా.. వెండి రూ.2.48 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇటీవల బంగారం రూ.1.80 లక్షలకు, వెండి దాదాపు రూ.4 లక్షలకు చేరిన సంగతి తెలిసిందే. గరిష్ఠ ధరలతో పోలిస్తే చాలావరకు వీటి ధరలు దిగి వచ్చాయి. బంగారం, వెండి కొనుగోలు ప్రణాళిక ఉన్నవారికి ఇటీవల ధరలు షాకివ్వగా.. తాజాగా వీటి ధరలు తగ్గుముఖం పట్టడం అలాంటివారికి ఊరట కలిగించే అంశం. కమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1,39,446 వద్ద కొనసాగుతోంది. దాదాపు 6 శాతం మేర పతనమైంది. కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర ఏకంగా 14.55 శాతం క్షీణించి రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతోంది.

### కారణాలు ఇవే..

అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా జెరోమ్ పావెల్ స్థానంలో కెవిన్ వార్ష్ పేరును ట్రంప్ ప్రతిపాదించడంపై మదుపర్లు ప్రతికూలంగా స్పందించడంతో వీటి ధరల్లో కరెక్షన్ జరిగింది. ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలోపేతం కావడంతో వీటి ధరలు దిగి వస్తున్నాయి. రాకెట్ వేగంతో దూసుకెళ్లిన ఈ రెండు లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇంకో కారణం.

అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్‌లో ఎప్పుడూ లేనివిధంగా బంగారం ఔన్సు 5,600 డాలర్లు, వెండి 122 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్‌తో డీల్ ఉంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో భౌగోళిక అనిశ్చితులు తగ్గుముఖం పట్టొచ్చన్న అంచనాలు తోడయ్యాయి. దీనివల్ల కూడా ఈ రెండు లోహాల ధరలు దిగి వస్తున్నాయని అనలిస్టులు పేర్కొంటున్నారు.

# ప్రీమియం స్మార్ట్‌ఫోన్లపై మోజు.. యాపిల్‌కు రికార్డు వాటా



దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో యాపిల్ హవా కొనసాగుతోంది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతుండడం యాపిల్‌కు కలిసొచ్చింది. 2025లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో విలువ పరంగా యాపిల్ 28 శాతం మార్కెట్ వాటా సాధించింది. ఇప్పటి వరకు యాపిల్‌కిదే అత్యధిక వాటా కావడం గమనార్హం. అంతకుముందు ఏడాది (2024)లో విలువ పరంగా యాపిల్ వాటా 23 శాతంగా ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ రిపోర్ట్ పేర్కొంది. ముఖ్యంగా యాపిల్ మార్కెట్ వాటా పెరుగుదలలో ఐఫోన్ 16 కీలక భూమిక పోషించింది. 2025లో అత్యధిక అమ్ముడైన మోడల్‌గా నిలిచింది. ఐఫోన్ 16 విక్రయాలు, ఫెస్టివల్ ప్రమోషన్లు, ఫైనాన్సింగ్ సదుపాయాలు (EMI) తదితర కారణాలు విలువ పరంగా యాపిల్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. 2025లో దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 1 శాతం వృద్ధి చెందగా.. విలువ పరంగా 8 శాతం వృద్ధి నమోదైంది.

### ఈఎంఐ కొనుగోళ్లే..

దేశంలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్లకు (రూ.30వేల పైబడిన) గిరాకీ పెరుగుతోంది. అయితే, ప్రీమియం సెగ్మెంట్‌లో మూడింట రెండొంతుల కొనుగోళ్లు ఫైనాన్సింగ్ ద్వారానే జరుగుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రీమియం ఫోన్లకు అప్‌గ్రేడ్ అయ్యేందుకు ఈఎంఐ సదుపాయాన్ని విస్తృతంగా వాడుతున్నారని నివేదిక తెలిపింది. అందుకే ఎంట్రీలెవల్, బడ్జెట్ సెగ్మెంట్ స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే ఈ సెగ్మెంట్ వేగంగా వృద్ధి చెందుతోందని నివేదిక తెలిపింది. సంఖ్యాపరంగా 11 శాతం, విలువ పరంగా 22 శాతం వృద్ధి చెందిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు.

విలువ పరంగా యాపిల్ అగ్రస్థానంలో ఉండగా.. ఫోల్డబుల్ ఫోన్ సెగ్మెంట్‌లో శాంసంగ్ సంఖ్యాపరంగా 88 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. విలువ పరంగా కంపెనీ మొత్తం వాటా అంతకుముందు ఏడాదితో పోలిస్తే 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఏ, ఎం, ఎఫ్, ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ద్వారా అన్నివర్గాల వినియోగదారులను చేరుకుంటోందని పేర్కొంది. మోటోరొలా (54 శాతం) వేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలవగా.. సీఎంఎఫ్ (83 శాతం) వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్న సబ్‌బ్రాండ్‌గా నిలిచింది. మొమరీల ధరలు పెరుగుదల వల్ల (రూ.15 వేల్లోపు) 2026 స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో సింగిల్ డిజిట్ వృద్ధి మాత్రమే నమోదు కావొచ్చని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ పేర్కొంది.

## కొత్తగా రూ.17.2 లక్షల కోట్ల రుణం సేకరణ

**హైదరాబాద్ :** దేశ జీడీపీలో ఇప్పటికే సగాని కంటే ఎక్కువగా అప్పులు చేసిన కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వచ్చే ఆర్థిక సంవత్సరం (202627)లో మరిన్ని అప్పులు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే డేటెడ్ సెక్యూరిటీలు, ఇతర మార్గాల నుంచి రికార్డు స్థాయిలో రూ. 17.2 లక్షల కోట్ల రుణాలను సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల పలు కీలక ప్రతిపాదనలు చేశారు. రాబడి, వ్యయాల మధ్య అంతరం పెరిగి భారీ ద్రవ్యలోటుకు దారితీయడంతో దాన్ని పూడ్చేందుకే కొత్తగా రుణాలు తీసుకోబోతున్నట్టు సమాచారం. తాజాగా సమీకరించే రూ. 17.2 లక్షల కోట్ల రుణాల్లో డేటెడ్ సెక్యూరిటీ నుంచి రూ. 11.7 లక్షల కోట్లు ఉంటాయని అంచనా. చిన్న మొత్తాల పొదుపు, ఇతర మార్గాల నుంచి మిగతా రుణాలు ఉండొచ్చని తెలుస్తున్నది.

గత 67 ఏండ్లలో కేంద్రం చేసిన అప్పు రూ. 55,87,147 కోట్లు కాగా, మోదీ ప్రధాని అయిన తర్వాత గడిచిన పదకొండున్నరేండ్లలో చేసిన అప్పు రూ. 1,52,85,363 కోట్లుగా ఉన్నది. అప్పటి ప్రధానులు ఏడాదికి సగటున రూ. 83 వేల కోట్లు అప్పులు చేస్తే, ప్రస్తుత ప్రధాని నెలకే రూ. 1.10 లక్షల కోట్ల అప్పు చేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏటా మిత్తీలకే రూ. 14,03,972 కోట్లను చెల్లించాల్సి వస్తున్నది. అంటే నెలకు చెల్లించాల్సిన మిత్తి రూ. 1.17 లక్షల కోట్లుగా ఉన్నది.

## సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో అదే సీన్.. మరో 19%పతనం




సిల్వర్ ఈటీఎఫ్‌ల పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర భారీగా పతనం అయిన నేపథ్యంలో ఆ ప్రభావం వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల మీద కూడా పడింది. శుక్రవారం 20 శాతం వరకు పతనం కాగా.. సోమవారం మరో 19 శాతం మేర పతనం అయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు ఇటీవల కాసుల వర్షం కురిపించిన సిల్వర్ ఈటీఎఫ్‌లు పడిపోవడంతో మదుపర్లు ఆందోళన చెందుతున్నారు.


దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతోంది. గురువారం ఇది రూ.4,20,048 వద్ద జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. గరిష్ఠాలతో పోలిస్తే కిలో వెండి విలువ దాదాపు రూ.2 లక్షల మేర పతనం అయ్యింది. దీంతో సిల్వర్ ఈటీఎఫ్‌లు క్షీణించాయి. టాటా సిల్వర్ ఈటీఎఫ్ 19.15 శాతం, ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 14.98, ఆదిత్య బిర్లా న్ లైఫ్ ఈటీఎఫ్ 14.6 శాతం చొప్పున పతనం అయ్యాయి. గ్రో సిల్వర్ ఈటీఎఫ్ 16.17 శాతం, జెరోదా సిల్వర్ ఈటీఎఫ్ 15.41 శాతం, నిప్పాన్ ఇండియా సిల్వర్ ఈటీఎఫ్ 15.69, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటీఎఫ్ 14.05 శాతం, కోటక్ సిల్వర్ ఈటీఎఫ్ 17.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ సిల్వర్ ఈటీఎఫ్ 16.65 శాతం, మోతీలాల్ ఓస్వాల్ సిల్వర్ ఈటీఎఫ్ 16.02 చొప్పున పతనం అయ్యాయి. డాలర్ విలువ పెరగడం, ట్రెజరీ బాండ్లపై రాబడి పెరగడం.. అదే సమయంలో మదుపర్ల లాభాల స్వీకరణతో వెండి ధరలు క్షీణిస్తున్నాయి.

## మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు.. కారణం ఇదేనట..!

ఈ ఏడాది ప్రారంభం నుంచే బంగారం, వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగి ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. ఒకదశలో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.2 లక్షలు దాటింది. కిలో వెండి ధర ఏకంగా 4.20 లక్షలకు చేరింది. కానీ గత నాలుగు రోజుల నుంచి ఈ విలువైన లోహాల ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. కేంద్రం బడ్జెట్, ఇన్వెస్టర్‌లు లాభాల కోసం షేర్లను విక్రయించడం ఈ ధరల పతనానికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ బ్యాంక్ ఛైర్మన్‌గా డొనాల్డ్ ట్రంప్ కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేయడం కూడా బంగారం, వెండి ధరల పతనానికి కారణమై ఉండవచ్చని మరికొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా బంగారం, వెండి ధరల పరుగులకు బ్రేక్ పడి పతనం మొదలవ్వడంతో కొనుగోలుదారుల్లో అంటే ముఖ్యంగా మధ్యతరగతి వారిలో ఆ లోహాలను కొనాలన్న ఆశ చిగురిస్తోంది.

ఇవాళ వెండి ధరలు 12 శాతం, బంగారం ధరలు 9 శాతం పతనమయ్యాయి. దాంతో ప్రస్తుతం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,090 కి దిగివచ్చింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,900 కు పడిపోయింది. కిలో వెండి ధర ఏకంగా రూ.2,59,000 కు పతనమైంది.

ఈ నేపథ్యంలో బంగారం, వెండి లోహాలను కొనుగోలు చేయడానికి ఇది అనువైన సమయమేనా..? అనే సందేహం వినియోగదారుల్లో నెలకొన్నది. ధరలు ఇంకా తగ్గుతాయా..? లేదంటే మళ్లీ పెరుగుతాయా అనే సందిగ్ధంలో చాలా మంది ఉన్నారు.





అయితే బంగారం, వెండిపై ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు మాత్రం కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో పెళ్లిళ్లు తదితర శుభ కార్యాలు ఉన్నవారు మాత్రం ఇప్పుడు బంగారం కొనుగోలు చేయడం ఉత్తమని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే ఇప్పుడు ధరలు తగ్గినా భవిష్యత్తులో మళ్లీ పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. అందుకే బంగారంపై దీర్ఘకాలికంగా పెట్టుబడులు పెట్టాలనుకునే వారు ఈ ధరల తగ్గుదలను అవకాశంగా తీసుకోవచ్చన్నారు.

# 30,000 మందిని తొలగించనున్న ఒరాకిల్..

ఐటీసహా వివిధ రంగాల్లో ఉద్యోగాల తొలగింపునకు ఏఐ ప్రధాన కారణంగా మారుతోంది. ఇప్పుడు ఏఐ ప్రభావంతో మరో సంస్థ కూడా భారీ సంఖ్యలో సిబ్బందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఒరాకిల్ సంస్థ ఏకంగా 30,000 వరకు ఉద్యోగాల్ని తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి కారణం ఓపెన్‌ఏఐ. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ టీడీ కోవెన్ ప్రకారం.. ఓపెన్‌ఏఐ సంస్థతో ఒరాకిల్ 300 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది.

ఇది ఈ కంపెనీకి అతిపెద్ద డీల్. దీని ద్వారా భారీ స్థాయిలో ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. అయితే, ఇది అమలు చేయాలంటే నిధులు చాలా అవసరం. అందుకే ఖర్చులు తగ్గించుకునేందుకు ఏకంగా 20,000 నుంచి 30,000 మంది సిబ్బందిని తొలగించేందు ఒరాకిల్ రెడీ అవుతోంది. దీనివల్ల కంపెనీకి 8 బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు మిగులుతుంది. ఓపెన్‌ఏఐతో ఒప్పందమే ఒరాకిల్ సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. గడిచిన రెండు నెలల్లోనే 58 బిలియన్ డాలర్లు ఒరాకిల్ కోల్పోయింది. డేటా సెంటర్ల కోసం 38 బిలియన్ డాలర్లు, న్యూ మెక్సికోలో కొత్త క్యాంపస్ కోసం 20 బిలియన్ డాలర్లు అవసరం. ఈ మూడింటి వల్లే ఒరాకిల్ నష్టాలు 100 బిలియన్ డాలర్లుగా ఉంది. మరోవైపు గత సెప్టెంబర్ నుంచి ఒరాకిల్ స్టాక్ విలువ భారీగా పడిపోయింది.

సగానికి సగం తగ్గి 463 బిలియన్ డాలర్లు తగ్గింది. మరోవైపు అమెరికన్ బ్యాంకులు కూడా ఒరాకిల్‌కు నిధులు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. ఒకవేళ అప్పులు ఇవ్వాలన్నా.. వడ్డీ రేట్లు రెట్టింపు చేస్తున్నాయి. కొన్ని ఆసియా బ్యాంకులు మాత్రం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. అవి సరిపోవు. అందుకే తమ క్లయింట్‌స్‌ను 40 శాతం చెల్లింపులు తక్షణమే చేయాల్సిందిగా కోరుతోంది. ఇలాంటి ఆర్థిక ఇబ్బందుల మధ్య కంపెనీ.. వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు తెలుస్తోంది.



# మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తే పాక్‌కు చుక్కలే



తమ జట్టు 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటుందని, అయితే ఫిబ్రవరి 15న శ్రీలంకలో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం మైదానంలోకి దిగదని పాకిస్తాన్ ప్రభుత్వం గత ఫిబ్రవరి 01న అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత క్రికెట్ ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్ తెలివి తక్కువగా ఇంత పెద్ద ప్రకటన చేసింది, కానీ దీనివల్ల కలిగే నష్టాన్ని వారు ఊహించలేదు అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్‌కు 5 పెద్ద నష్టాలు ఉన్నాయి. దైనిక్ జాగరణ్ ప్రకారం, పాకిస్తాన్ ఈ నిర్ణయం ప్రకటించడం అంటే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు ప్రపంచ కప్ నుండి ఆ జట్టుపై నిషేధం పడవచ్చు. టోర్నమెంట్ నుండి బంగ్లాదేశ్ ఇప్పటికే తన పిచ్చి నిర్ణయం కారణంగా నిష్క్రమించింది. ఇప్పుడు పాకిస్తాన్ ప్రపంచ కప్ నుండి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్తాన్ ఆదాయంపై కూడా ఐసిసి నిషేధం విధించవచ్చు. నివేదికల ప్రకారం, ఐసిసి ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 316 కోట్ల రూపాయలు) ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నిలిచిపోతే పాకిస్తాన్ పూర్తిగా దివాలా తీసినట్లే. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, పాకిస్తాన్ జట్టు జియోస్టార్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి రావచ్చు. ప్రపంచ కప్‌లో భారత్‌పాకిస్తాన్ మ్యాచ్ ద్వారా అత్యధికంగా సంపాదన వస్తుంది. ఈ మ్యాచ్‌లో 10 సెకన్ల ప్రకటన స్లాట్ సైతం చాలా ఖరీదైనది. మ్యాచ్ జరగకపోతే వారికి చాలా నష్టం వాటిల్లుతుంది. పాకిస్తాన్ మీద ద్వైపాక్షిక సిరీస్‌లపై కూడా పూర్తి నిషేధం విధించవచ్చు. ఈ నిషేధంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మరింత దివాళా తీస్తుంది. ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ పాకిస్తాన్ సూపర్ లీగ్ లో సైతం నష్టపోవచ్చు. వాస్తవానికి, టోర్నమెంట్ కోసం విదేశీ ఆటగాళ్ల ఎనఓసి అంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పై నిషేధం విధించవచ్చు. భారత్ తో మ్యాచ్ లు ఆడకూడదనే నిర్ణయం గురించి పిసిబి ఇంకా ఐసిసికి తెలియజేయలేదని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బహిష్కరణను పిసిబి అధికారికంగా ఐసిసికి తెలియజేసిన తర్వాతే చర్యలు చేపడుతుంది.. 2026 టి 20 ప్రపంచ కప్ నుండి పాకిస్తాన్ ను మినహాయించవచ్చు అని ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ టి 20 లీగ్ (పిఎస్ఎల్) లో విదేశీ ఆటగాళ్లకు ఎనఓసిలు ఇవ్వడానికి కూడా ఐసిసి నిరాకరించవచ్చు. బంగ్లాదేశ్ ను వెనకుండి ప్రోత్సహించిన కారణంగా, వారికి ఓ న్యాయం, తమకు ఓ న్యాయం ఉండదని చెప్పడానికి.. బంగ్లా దారిలో పయనించి పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఐసిసి షెడ్యూల్ ప్రకటించిన తర్వాత తమ మ్యాచ్ లను భారత్ వెలుపల తరలించడానికి నిరాకరించిన తరువాత టి 20 ప్రపంచ కప్ లో పాల్గొనకూడదని బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీని తరువాత, పాకిస్తాన్ ఆటగాళ్ళు, పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ ఐసిసిని విమర్శించారు. టోర్నమెంట్ ను బహిష్కరిస్తాం అన్నారు. అయితే, సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో మ్యాచ్ ఉంటే ఏం చేయనున్నారో పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. అప్పుడు వారు ఆడతారా లేదా? ప్రస్తుతం పాక్ ప్రభుత్వం ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మాత్రమే ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది.

# ఇండియా-ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ



టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా సన్నాహకాల్లో భాగంగా రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం బీసీసీఐ సోమవారం (ఫిబ్రవరి 2) ఇండియాఎ జట్టును ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మ రీఎంట్రీ ఇవ్వడం, ఐపీఎల్ స్పీడ్ స్టార్ మయాంక్ యాదవ్ జట్టులోకి రావడం ఈ స్క్వాడ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమిండియా తన సన్నాహకాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అమెరికా, నమీబియాతో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ, యువ రక్తాన్ని పరీక్షించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి జట్టు పగ్గాలను అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న బదోనికి ఇది ఒక పెద్ద అవకాశం. తెలుగు క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. గాయం కారణంగా కొన్నాళ్లు దూరమైన తిలక్ వర్మ జట్టులోకి తిరిగొచ్చాడు. సర్జరీ తర్వాత కోలుకున్న తిలక్, ఫిట్‌నెస్ టెస్ట్ పాసై జట్టులో చేరాడు. అయితే ఇందులో ఒక చిన్న ట్విస్ట్ ఉంది. తిలక్ వర్మ ఇండియాఎ తరపున కేవలం ఒకే ఒక్క వార్మప్ మ్యాచ్ ఆడతాడు. ఆ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాత నేరుగా టీమిండియా(సీనియర్ జట్టు)లో చేరి వరల్డ్ కప్ ఆడతాడు. ఇది తిలక్ కెరీర్‌కు అత్యంత కీలకమైన సమయం. ఐపీఎల్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో ఆడిన తర్వాత గాయపడిన మయాంక్, సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. అతని వేగం టీమిండియాకు రాబోయే రోజుల్లో పెద్ద ఆస్తి కానుంది. మయాంక్ తో పాటు ఖలీల్ అహ్మద్, రవి బిష్ణోయ్ వంటి సీనియర్ బౌలర్లు కూడా ఈ జట్టులో ఉండటం విశేషం. ఇక రెండో మ్యాచ్ ఫిబ్రవరి 6 (శుక్రవారం) నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచుల ద్వారా యువ ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలించి, అవసరమైతే మెయిన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి ఎవరినైనా తీసుకునే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ వంటి హిట్టర్లు ఈ జట్టులో ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

ఇండియాఎ స్క్వాడ్ (వార్మప్ మ్యాచుల కోసం): ఆయుష్ బదోని (కెప్టెన్), నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ, ప్రియాంశ్ ఆర్య, ఎన్.జగదీశన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, రియాన్ పరాగ్, మానవ్ సుతార్, అశోక్ శర్మ, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్), గుర్జాప్నీత్ సింగ్, విప్రజ్ నిగమ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్.

# నా మాటలు వక్రీకరించారు: మేరీకోమ్



భారత ప్రముఖ బాక్సర్ మేరీకోమ్? మరోసారి తన వైవాహిక బంధం గురించి మాట్లాడింది. ఇటీవల మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్‌పై ఆరోపణలు చేసే క్రమంలో ఆమె మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా తన తన మాజీ భర్తను ఉద్దేశించి మాత్రమే చేశానని, ఇంకెవరినీ బాధపెట్టాలని చేసింది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసింది. 'చాలా ఏళ్ల పాటు మా వైవాహిక బంధం సజావుగానే సాగింది. అయితే నా భర్త తనను ఆర్థికంగా మోసగించడం వల్ల మా రిలేషన్ దెబ్బతింది. ఆ తర్వాతే మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. గతేడాది మాకు విడాకులు మంజూరైన తర్వాత నాపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా దాడి జరిగింది. అయినా నేను సంయమనం పాటించాను' 'రీసెంట్?గా ఒక టాక్‌షోలో నేను మాట్లాడిన మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించండి. ముఖ్యంగా పురుష సమాజం. ఆ మాటలన్నీ, నా వ్యక్తిగత జీవితంలో నేను అనుభవించిన బాధ నుంచి వచ్చినవే. అయితే నా మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. కానీ నేను ఏ ఆటకు కూడా వ్యతిరేకం కాదు. నేను క్రీడాకారులందర్నీ గౌరవిస్తా' అని మేరీకోమ్ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మేరీకోమ్ తన మాజీ భర్తపై ఆరోపణలు చేసింది. అతడు 'గల్లీ ఫుట్?బాల' (Ga శ్రీఅ ఖీశీశీtbaశ్రీశ్రీ) ఆటగాడంటూ విమర్శించింది. 'అనేక మందిలాగే అతడు కూడా ఓ సాధారణ గల్లీ ఫుట్?బాల్ ప్లేయర్. అంతమాత్రాన అతను బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రి అవ్వలేదు. కెరీర్?లో అసలు సక్సెస్ అవ్వలేదు' అని మేరీకోమ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఇందులో 'గల్లీ ఫుట్? బాల' అనే వ్యాఖ్యల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఇది కాంట్రవర్సీ అయ్యింది. ఈ వ్యాఖ్యలపై మేరీకోమ్ తాజాగా క్లారిటీ ఇస్తూ, క్షమాపణలు కోరింది. అయితే ఆమె మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్ ఓ ఫుట్‌బాల్ ఆటగాడు. అయితే మేరీకోమ్ కోసం తన కెరీర్‌ను సైతం వదులుకున్నానని కరుంగ్ గతంలో ఓ సందర్భంలో చెప్పారు. దీనిపైనే మేరీకోమ్ విరుచుకుపడింది. అలా మాట్లాడింది. అయితే తామిద్దరు దిల్లీలో కలుసుకున్నప్పటికే కరుంగ్ తన కెరీర్‌ను వదిలేశారని మేరీకోమ్ పేర్కొంది. 2005లో మేరీకోమ్ కరుంగ్ ఆంఖోలర్ వివాహం జరిగింది. మణిపుర్?కు చెందిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్?లో అనేక ఘనతలు సాధించింది. అంతర్జాతీయ వేదికల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించిన మేరీకోమ్ ఎన్నో మరపురాని విజయాలు సాధించింది. 2012లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేతగా నిలిచింది. మహిళా బాక్సర్లలో ఇంకెవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా ఆరుసార్లు వరల్డ్? ఛాంపియన్‌గా నిలిచింది. 2016 నుంచి 2022 మధ్య రాజ్యసభకు కూడా మేరీకోమ్ ప్రాతినిధ్యం వహించింది. అయితే 41ఏళ్ల మేరీకోమ్ ప్రస్తుతం బిగ్ ఈవెంట్?లలో ఆడకున్నా, రిటైర్మెంట్ తీసుకున్నట్లు మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. దేశం తరపున ఇంకా పతకాలు సాధించాలనే ఆకలి ఉన్నట్లు గతంలో ఓ సందర్భంలో పేర్కొంది.

## గాయం కారణంగా ఇషాన్ మలింగ టోర్నీకి దూరం



టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి అంతా సిద్ధమవుతున్న వేళ, శ్రీలంక క్రికెట్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, వికెట్ టేకింగ్ బౌలర్‌గా పేరు తెచ్చుకున్న ఇషాన్ మలింగ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్ సందర్భంగా మలింగ భుజానికి తీవ్రమైన గాయమైంది. దీంతో అతడు కోలుకోవడానికి కనీసం ఆరు వారాల సమయం పడుతుందని వైద్యులు తేల్చి చెప్పారు. ప్రపంచకప్ ముంగిట ఇలా జరగడం లంక జట్టు ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. శ్రీలంక క్రికెట్‌లో ప్రస్తుతం ఇషాన్ మలింగ ఒక సంచలనం. కేవలం 24 ఏళ్ల వయసులోనే తన అద్భుతమైన బౌలింగ్‌తో బ్యాటర్లను వణికించాడు. ఇప్పటివరకు 8 టీ20ల్లో 8 వికెట్లు తీసినప్పటికీ, ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన తీరు అతడిని స్టార్‌ను చేసింది. గత ఐపీఎల్ సీజన్‌లో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 13 వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. అలాంటి కీలక బౌలర్ ఇప్పుడు భుజం గాయం వల్ల ఆరు వారాల పాటు ఆటకు దూరం కావడం శ్రీలంకకు పెద్ద లోటు. లెజెండరీ బౌలర్ లసిత్ మలింగ పేరును గుర్తుకు తెచ్చేలా ఇతని బౌలింగ్ శైలి ఉంటుంది. అందుకే అభిమానులు ఇతడిని ఎంతో ఇష్టపడతారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడంలో ఇషాన్ దిట్ట. ఐపీఎల్‌లో 31 పరుగులిచ్చి 3 వికెట్లు తీయడం అతని కెరీర్ బెస్ట్ ప్రదర్శనగా ఉంది. టీ20 వరల్డ్ కప్‌లో శ్రీలంకకు ఇతనే ప్రధాన అస్త్రం అని భావించిన తరుణంలో, ఈ గాయం వార్త ఆ జట్టును ఆత్మరక్షణలో పడేసింది. ఇషాన్ మలింగ దూరమవ్వడంతో అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు దిల్షాన్ మధుశంక లేదా ప్రమోద్ మదుషన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, దిల్షాన్ మధుశంక రేసులో ముందున్నాడు. గతంలో గాయాలతో సతమతమైన మధుశంక, ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి రావడం లంకకు కలిసొచ్చే అంశం. ప్రస్తుతం అతను ఒమన్‌తో జరగబోయే ప్రాక్టీస్ మ్యాచ్ కోసం శ్రీలంకఎ జట్టులో చేరాడు. అక్కడ తన ఫామ్ నిరూపించుకుంటే నేరుగా వరల్డ్ కప్ ప్రధాన జట్టులోకి వస్తాడు. శ్రీలంక ఫిబ్రవరి 1వ తేదీనే తన జట్టును ప్రకటించినప్పటికీ, ఐసీసీ నిబంధనల ప్రకారం గాయపడిన ఆటగాళ్ల స్థానంలో కొత్తవారిని తీసుకునే అవకాశం ఉంది. దసున్ శనక సారథ్యంలో లంక ఈసారి ఎలా రాణిస్తుందో చూడాలి.

**వరల్డ్ కప్ కోసం శ్రీలంక జట్టు (ప్రస్తుతానికి):**

దసున్ శనక (కెప్టెన్), పథుమ్ నిస్సాంక, కమిల్ మిషార, కుసాల్ మెండిస్, చరిత్ అసలంక, కుసాల్ పెరీరా, కమిందు మెండిస్, జనిత్ లియానగే, పవన్ రత్నాయకే, వనిందు హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర, మతీషా పతిరానా.

## ఐసీసీ ఆంక్షలకు భయపడం..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. 'భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి.భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ భారత్ రావడానికి నిరాకరించినప్పుడు ఐసీసీ తేలికగా తీసుకుంది. కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం మారిపోయింది.

## టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు

సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20లో సమష్టిగా చెలరేగిన పాకిస్థాన్ 111 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది.208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 96 పరుగులకే ఆలౌటైంది. మహమ్మద్ నవాజ్(5/18) ఐదు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. షాహీన్ షా అఫ్రిది(2/16) రెండు వికెట్లు తీసాడు. అబ్రర్ అహ్మద్, నసీమ్ షా తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో కామెరూన్ గ్రీన్(22), మార్కస్ స్టోయినీస్(23), జోష్ ఫిలిప్పే(14) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. సైమ్ ఆయుబ్(37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56), బాబర్ ఆజామ్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షాదాబ్ ఖాన్(19 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 46) దూకుడుగా ఆడారు.ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా బాబర్ ఆజామ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించాడు. బాబర్ ఆజామ్ ఇప్పటి వరకు 39 అర్ధ శతకాలు సాధించగా.. విరాట్ కోహ్లీ 38 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

## ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం



2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరపున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరపున అరంగేట్రం చేశాడు. మొదటి బంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అప్పుడే అతనిలో ఏదో తెలియని అద్భుతమైన ప్రతిభ ఉందని నాకు అర్థమైంది" అంటూ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నుంచి ట్రేడ్ చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని కూడా పాంటింగ్ వెల్లడించారు. "అతన్ని వదులుకోవద్దని నేను మేనేజ్‌మెంట్‌ను బతిమిలాడాను. ఒక అద్భుతమైన సూపర్‌స్టార్ తయారవుతున్నాడని చెప్పాను. ఇప్పుడు అది నిజమైంది" అంటూ తెలిపాడు. 2018 అండర్19 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన అభిషేక్, ఇప్పుడు తన మొదటి సీనియర్ టీ20 ప్రపంచకప్ ఆడబోతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన 4 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 152 పరుగులతో దుమ్మురేపాడు. మూడో మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఇది టీ20ల్లో భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ. 2007లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన యువరాజ్ సింగ్ మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలనే భారత ప్రయత్నంలో అభిషేక్ కీలక పాత్ర పోషించనున్నాడు. గ్రూప్A లో ఉన్న భారత్, ఫిబ్రవరి 7న అమెరికాతో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# నన్ను ఓ ఉగ్రవాదిలా చూశారు..

## టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్

టీమిండియా మాజీ పేసర్, వరల్డ్ కప్ విన్నర్ శ్రీశాంత్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన కాలాన్ని గుర్తు చేసుకున్నాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంతో తనను ఓ ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. జట్టులోని అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లతో కలిసి శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీసీసీఐ కూడా అతనిపై నిషేధం విధించింది. దాంతో శ్రీశాంత్ కెరీర్ అర్థాంతరంగా ముగిసిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు శ్రీశాంత్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, బీసీసీఐ అతనిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గించింది. నిషేధం ముగిసిన తర్వాత శ్రీశాంత్ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా సత్తా చాటలేకపోయాడు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు పలికి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా, సినీ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు.తాజాగా తన సతీమణి భువనేశ్వరి కుమారితో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్... స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యాడు. 'నా జీవితంలోనే స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని మరిచిపోలేను. నా వివాహ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే అరెస్ట్ కావడం అతిపెద్ద విషాదం. 2012లో నాకు ఆరు సర్జరీలు జరిగాయి, నేను వీల్ చైర్‌కే పరిమితమయ్యాను. అదే సమయంలో నాపై ఉగ్రవాది అనే ముద్ర వేశారు. నా మామగారి దగ్గరకు వెళ్లి.. 'నేను మళ్ళీ క్రికెట్ ఆడలేకపోవచ్చు, పైగా నాపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి' అని చెప్పాను.'అని శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. శ్రీశాంత్‌పై వచ్చిన ఆరోపణలను తాను నమ్మలేదని అతని సతీమణి భువనేశ్వరి వివరించింది.'శ్రీశాంత్ అరెస్ట్ వార్త ఒక షాక్ లాంటిది. నా స్నేహితులు ఫోన్ చేసి టీవీ చూడమని చెప్పే వరకు నాకు ఈ విషయం తెలియదు. టీవీలో 'శ్రీశాంత్ అరెస్ట్' అనే వార్త చూసి నేను షాక్‌కు గురయ్యాను. వెంటనే మా నాన్న దగ్గరకు వెళ్లి ముందు నాకు ఒక మాట ఇవ్వండి.. నా పెళ్లి ఆపకూడదని కోరాను. స్వయంగా ఆ దేవుడే వచ్చి శ్రీశాంత్ తప్పు చేశాడని చెప్పినా నేను నమ్మను.'అని తన తండ్రితో గట్టిగా చెప్పినట్లు భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు.



# పౌరాణిక పాత్రల్లో ఒదిగిపోవాలి



## పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయాల్సిందే
## రామాయణ మూవీపై అరుణ్ గోవిల్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' సినిమాలోని పాత్రల గురించి నటుడు అరుణ్ గోవిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి చిత్రాల్లో నటీనటుల లుక్స్‌పై ప్రేక్షకులు ఎక్కువగా ఫోకస్ చేస్తారని తెలిపారు. వారిని జీవితమంతా అదే పాత్రలో గుర్తుంచుకుంటారని అన్నారు. రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణ'లో అరుణ్ రాముడిగా కనిపించారు. అప్పటినుంచి రాముడి పాత్ర అనగానే ఆయనే గుర్తుండిపోయేలా అందులో కనిపించి ఆకట్టుకున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లో అరుణ్ గోవిల్ దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి మాట్లాడుతూ.. 'ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం దేవుడి పాత్ర పోషించేటప్పుడు చూడగానే అలానే కనిపించాలని. లుక్స్ చాలా ముఖ్యం. ఆడియన్స్ తెరపై మనల్ని చూడరు.. మన పాత్రలో ఉన్న దేవుడిని చూస్తారు. బహుశా దేవుడు నిజంగా ఇలానే ఉండటాడేమో అనుకోవాలి. అంతలా మనం ప్రభావితం చేయాలని చెప్పారు. ఇక ఈ చిత్రాన్ని 'ఆదిపురుష'తో పోల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి చిత్రం దేనికదే ప్రత్యేకమన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా రానున్న ఈ సినిమాలో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4,000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీస్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఇందులో రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

# జైలర్ 2లో షారూఖ్ ఖాన్



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్స్ట్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.




# కొత్త తారలతో మ్యాడ్3 చిత్రీకరణ




టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఓటిటిలో ట్రెండ్ అవుతున్న శంబాలా



ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమ్రింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# మూవీగా వస్తోన్న మిర్జాపూర్ వెబ్ సీరిస్

యాక్షన్ క్రైంథ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మీర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మీర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థ్రియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మీర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.





PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154